TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలని అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :143 prajadivvs57@gmail. com గురువారం 9 ఏప్రిల్ 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

## బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు.


## రాబోయే 48 గంటలు గడపదాటొద్దు

### ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం ఎమర్జెన్సీ అలర్ట్

ట్రంప్ హెచ్చరికతో టెహ్రాన్‌లో ఉత్కంఠ

ఎక్కడివారు అక్కడే ఉండాలని ఎంబసీ ఆదేశం

2



## కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ



### రేవంత్‌తో నాకేం పని?

- తెలంగాణ నేతలే సమాధానం చెప్తారు
- పినరయి ఘాటు వ్యాఖ్యలు!

2

### విజయన్, మోడీ మంచి మిత్రులు

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డీఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

**కేరళలో పినరయి విజయన్, ఢిల్లీలో నరేంద్ర మోదీ ఇద్దరూ 'పొలిటికల్ బ్రదర్స్' అని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మోదీ సూచనల మేరకే కేరళలో పాలన సాగుతోందని, కేంద్రంలోని కేసుల నుండి తప్పించుకోవడానికే విజయన్ అగ్రనేతలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు.**

**తిరువనంతపురం:** కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి

మిగతా 2 లో

## గ్యారెంటీలు ఏవీ?

### రేవంత్‌పై హరీష్ ఫైర్!

- పరిగిలో భూముల దోపిడీపై ధ్వజం
- అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- తమ్ముడి కోసం రైతుల భూములా?
- రేవంత్ ఓ రావణాసురుడు
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు
- హరీష్ రావు





## ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్


### 1200 కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. మంగళవారం ఖానామెట్ లో రూ.1200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు.

2

## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

.. వివరాలు 2లో





## మావోయిస్టుల శకం ముగిసింది


### కర్రెగుట్టల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు

### మావోయిస్టు అడ్డాల్‌ఓ అభివృద్ధి పరుగులు

### రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం, సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు.

## ఇరాన్ అంతం ఖాయం



- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

## రెడ్ లైన్స్ దాటొద్దు

- అమెరికాకు తలుపులు మూసేసిన ఇరాన్
- తమ ఇంధన వనరులపై దాడి చేస్తే బాబ్-అల్-మండేబ్ మూసేస్తామని హెచ్చరిక






# రాబోయే 48 గంటలు గడపదాటొద్దు

**ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం ఎమర్జెన్సీ అలర్ట్**

**ట్రంప్ హెచ్చరికతో టెహ్రాన్‌లో ఉత్కంఠ**

**ఎక్కడివారు అక్కడే ఉండాలని ఎంబసీ ఆదేశం**

**న్యూఢిల్లీ:** ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఓ నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ కు తీవ్ర హెచ్చరిక జారీ చేయడం పట్ల భారత కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీ చేసిన సలహాలో పలు కీలకమైన సూచనలు ఉన్నాయి. "తదుపరి 48 గంటల పాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారు పై అంతస్తుల్లో ఉండవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 7-8 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ రాత్రికి ఇరాన్ జాతి మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని కూడా ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను (+989128109115, +989128109102, +989128109109, +989932179359) అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈ-మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది. పరిస్థితి వేగంగా మారే అవకాశం ఉన్నందున, పౌరులందరూ అధికారిక ప్రకటనలను నిరంతరం గమనిస్తూ ఉండాలని విజ్ఞప్తి చేసింది.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం**

తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోకపోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.



# కేరళలో కాంగ్రెస్ సునామీ ఖాయం

మొదటి పేజీ తరువాయి

మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన



ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లీలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

# రేవంత్‌తో నాకేం పని?

**తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుంటారని ఎద్దేవా**

**తిరువనంతపురం:** తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 'మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను.



మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

- కర్రెగుట్టల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డాల్లో అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

: తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం, సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా



సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో, టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

# ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

**12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం**

ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు క్లెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.



# ప్రభుత్వ బడికి పునర్వైభవం: మూతపడే స్థాయి నుండి నవోదయ సీట్ల వరకు..

**-మల్లారం సర్పంచ్ 'స్టడీ సర్కిల్'తో మారిన విద్యార్థుల తలరాత: రాజనగర్ పాఠశాల విద్యార్థుల ఘనత**

**- రాజనగర్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే: విజేతలను అభినందించిన మండల అధికారులు**

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** వేములవాడ గ్రామీణ మండలం మల్లారంలోని రాజనగర్ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే మరియు వార్షికోత్సవ వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఓ ప్రజాప్రతినిధి ఆలోచన విద్యార్థుల భవిష్యత్తును ఎలా మారుస్తుందో ఈ పాఠశాల ఫలితాలు నిరూపిస్తున్నాయి. మల్లారం గ్రామ సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ నేడు అద్భుత ఫలితాలను ఇస్తోంది. ఒకప్పుడు విద్యార్థులు లేక మూతపడే స్థితికి చేరుకున్న ఈ పాఠశాల, నేడు నవోదయ, గురుకుల సీట్లతో జిల్లాలోనే ప్రశంసలు అందుకుంది. సర్పంచ్ గా గెలిచిన నాటి నుండి గ్రామ అభివృద్ధిలో విద్యే కీలకమని అర్పిత వీరారెడ్డి నమ్మారు. కేవలం పాఠశాల సమయానికే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాన్నే వేదికగా మార్చారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన బోధన, మెటీరియల్ మరియు నిరంతర పర్యవేక్షణ అందేలా చొరవ చూపారు. స్వయంగా సర్పంచ్ విద్యార్థుల చదువుపై శ్రద్ధ తీసుకోవడం తల్లిదండ్రుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. సర్పంచ్ చొరవతో నడుస్తున్న ఈ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఈ ఏడాది సత్తా చాటారు. అత్యంత



కఠినమైన నవోదయ మరియు గురుకుల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించి, ప్రభుత్వ పాఠశాల స్థాయిని పెంచారు. మూతపడే స్థాయి నుండి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించే స్థాయికి రాజనగర్ విద్యార్థులు ఎదగడం వెనుక సర్పంచ్ నెలకొల్పిన స్టడీ సర్కిల్ కృషి ఎంతైనా ఉందని అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదవ తరగతి పూర్తి చేసిన 13 మంది విద్యార్థులకు మెడల్స్ మరియు ఫోటో షీల్డ్‌లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన తహసిల్దార్ అబూబాకర్, ఎంపీడీవో కె. శ్రీనివాస్ మరియు మండల విద్యాధికారి లోకినీ కిషన్ మాట్లాడుతూ.. పంచాయతీ ఆవరణలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన సర్పంచ్ అర్పిత వీరారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఈ స్టడీ సర్కిల్ ఒక మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొంపల్లి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు లింగంపల్లి రాజు, ఉపాధ్యాయురాలు తెల్ల వకుళ, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కళ్లముందే పసికందు మృతి.. కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు!

**- వేములవాడ ఏరియా ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన**



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** కళ్లముందే పసికందు ప్రాణాలు కోల్పోవడంతో కన్నవారి కడుపుకోత వర్ణనాతీతంగా మారింది. వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డను బలితీసుకుందని ఆరోపిస్తూ బాధితులు వేములవాడ ఏరియా ఆసుపత్రి ఎదుట నిరసనకు దిగారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన చింద్రవేణి అనూష అనే గర్భిణి ప్రసవం కోసం ఐదు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరారు. ఆమెకు డెలివరీ చేయగా మగబిడ్డ జన్మించాడు. అయితే శిశువు జన్మించినప్పటి నుండి వైద్యులు కనీస పర్యవేక్షణ చేయలేదని, సరైన సేవలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని బంధువులు ఆరోపించారు. వైద్యుల బాధ్యతారాహిత్యం వల్లే శిశువు మృతి చెందాడని, బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు. "నమ్మి వస్తే వైద్యుల నిర్లక్ష్యం మాకు తీరని శోకాన్ని మిగిల్చింది" అని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధితుల ఆందో ళనతో ఆసుపత్రి పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని వారు భీష్మించుక కూర్చున్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై స్థానికులు మండిపడుతున్నారు. గతంలో కూడా గర్భిణీలను వెనక్కి పంపిన ఘటనలు ఉన్నాయని, వరుసగా ఫిర్యాదులు వస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**- మరిమడ్ల గ్రామంలో పంట పొలాలను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**

**కొనరావుపేట మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వానకు దెబ్బతిన్న పంట పొలాలను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత రైతులతో మాట్లాడి, నేలమట్టమైన వరి పంటను స్వయంగా పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోయి నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి, పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని, అలాగే విత్తనాలు, ఎరువుల రూపంలో తక్షణ సహాయం అందించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులను రక్షించేందుకు ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ





కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ధర్మారం గ్రామ సర్పంచ్, మండల అధ్యక్షులు మీరాల్కర్ బాలాజీ, మాజీ జెడ్పిటిసి పల్లం అన్నపూర్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టే రామచంద్రం, వివిధ విభాగాల పదాధికారులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ చిన్నారులకు డ్రై ఫ్రూట్స్, న్యూట్రిషన్ ఫుడ్ అందించాలి



**- రుద్రంగి 4వ వార్డు మెంబర్ చెప్యాల శిరీష గణేష్**

**రుద్రంగి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** రుద్రంగి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం మరియు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 4వ వార్డు మెంబర్ చెప్యాల శిరీష గణేష్ హాజరై, చిన్నారులకు అన్నప్రాసన చేసి పౌష్టికాహారాన్ని తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. గర్భవతులు, బాలింతల క్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఐదు సంవత్సరాల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అదేవిధంగా, గర్భవతులు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించి, వారికి న్యూట్రిషన్ ఫుడ్‌తో పాటు డ్రై ఫ్రూట్స్ కూడా అందించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ టీచర్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఏఎన్ఎం విజయ, పల్లె దవాఖాన సిబ్బంది మరియు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# త్రాగునీటి ఎద్దడి నివారణకు మండలంలో నాలుగు బోర్లు మంజూరు



**ముస్తాబాద్/ ఏప్రిల్ 8 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటన సందర్భంగా పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజల వినతి మేరకు గ్రామాల్లో నెలకొన్న వేసవి లో తాగు నీటి కొరతను తీర్చాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగ వారు వెంటనే స్పందించి వేసవి త్రాగు నీటి ఎద్దడి నివారించడానికి మండలంలోని ముస్తాబాద్ కు రెండు మొల్లయిపల్లి కి ఒకటి తెర్లమద్ది కి ఒకటి మంజూరు చేసినట్లు బిజెపి మండల శాఖ అధ్యక్షులు సౌళ్ళ క్రాంతికుమార్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు తెర్లుమద్ది గ్రామంలో ఎంపి ల్యాండ్స్ ద్వారా మంజూరైన మంచి నీటి కొరకు బోర్ వేయించటం జరిగిందన్నారు ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతికుమార్,తెర్లుమద్ది గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ సెక్రటరీ సౌజన్య ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్ లు మరియు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజగౌడ్, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ,ఉపాధ్యక్షులు కాసోడి రమేష్, బట్టు దీప బూత్ అధ్యక్షులు చిర్రం మహేష్, పల్లె తిరుపతి సోషల్ మీడియా కో కన్వీనర్ ధను బీజేపీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# మన ఇసుక వాహనం వెబ్సైట్ పై అవగాహన సదస్సు





**ముస్తాబాద్/ ఏప్రిల్ 8 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఇసుక వాహనం వెబ్సైట్ పై మండల తహసిల్దార్ రామచంద్రం ఆధ్వర్యంలో ట్రాక్టర్ యజమానులకు పంచాయతీ కార్యదర్శులకు జిపిఓలకు మన ఇసుక వాహనం అనే నూతన వెబ్సైట్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి లచ్చాలు మండల రెవెన్యూ పరిశీలకులు రఘు పంచాయతీ కార్యదర్శులు జిపిఓలు ట్రాక్టర్ యజమానులు డ్రైవర్స్ పాల్గొన్నారు

# ప్రేమ-పెళ్లి పేరుతో యువతిని వేధిస్తున్న యువకుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

**- అమ్మాయిలను వెంటపడి వేధిస్తే ఉపేక్షించేది లేదు.**

**- అమ్మాయిలు వేధింపులకు గురైతే నిర్భయంగా పిర్యాదు చేయండి: సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.**



**రుద్రంగి మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ...ఒక యువతిని రుద్రంగి కి చెందిన సింగారపు గణేష్ అనే వ్యక్తి పరిచయం చేసుకుని ఆమెతో మాట్లాడుతు ప్రేమిస్తున్నని తనని పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడని ఆ యువతి సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని గణేష్ ని ఈ రోజు అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించాడం జరిగిందని తెలిపారు. అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ప్రేమ--పెళ్లి పేరుతో వెంటపడడం, ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. వేధింపులకు గురైన యువతులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సాగు, తాగునీటి గోస తీరాలి: కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల పరిశీలన







**వేములవాడ నియోజకవర్గము/ ప్రజాదివాస్ ఏప్రిల్ 08** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల రైతులకు సాగు, తాగునీటిని అందించే కీలకమైన కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్టు క్షేత్రస్థాయి పనులను పర్యవేక్షించిన ఆయన, పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి, రైతులకు నీరందించే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు మండలాల రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంతో పాటు, తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# వేములవాడ భీమేశ్వరుడిని దర్శించుకున్న మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి దంపతులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రజా పాలన ముఖ్య ధ్యేయం..

## వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో 15 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..

## మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు తిరుపతి యాదవ్



**వీర్నపల్లి ఏప్రిల్ 8 ప్రజా దివాస్** వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో జజ రోడ్డు పనులు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.టి యాదవ్ గారూ మాట్లాడుతూ గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటే ముఖ్య ఉద్దేశం అన్నారు.ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పాలన నడుస్తుందని కొనియాడారు.15 లక్షల నిధులు మంజూరుకు సహకరించిన సిరిసిల్ల నియోజక ఇంచార్జీ మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు బూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిరుపతి యాదవ్ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పర్లపల్లి దేవయ్య, వార్డు సభ్యులు విష్ణు, దినేష్, ముద్దం రేణబాలయ్య, నాయకులు రవి నాయక్, రాజెల్లయ్య, రవి వెంకట్రాం, అంగోతు నరేష్, రాజేందర్.. తదితరులు పాల్గొన్నారు.

# హన్మాజీపేట గ్రామంలో హిందూ సమ్మేళన సన్నాహక సమావేశం.. అధ్యక్షునిగా సామ లచ్చిరెడ్డి ఎన్నిక

**వేములవాడ మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట ఉపమండల జాగరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో హిందూ సమ్మేళన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపమండల పరిధిలోని ఐదు గ్రామాల నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. రాబోయే హిందూ సమ్మేళన నిర్వహణ కోసం ప్రత్యేకంగా 'హిందూ సమ్మేళన సమితి'ని ఏర్పాటు చేశారు. ఈ సమితి అధ్యక్షునిగా సామ లచ్చిరెడ్డిని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి మరియు కార్యవర్గ సభ్యులను కూడా నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సామ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఏప్రిల్ 12 ఆదివారం రోజున గ్రామంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి కాషాయ



వస్త్రధారణతో పలువురు స్వామీజీలు వక్తలుగా విచ్చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తారని తెలిపారు. బొల్లారం, లింగంపల్లి, హనుమాజీపేట, మల్లారం, జయవరం గ్రామాలలోని హిందూ బాంధవులందరూ సకుటుంబ సమేతంగా తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమ్మేళనం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిట్టల భూమేష్ ను చంపుతానని బెదిరింపులు

**- కోర్టు విధుల బహిష్కరణ.. రౌడీషీటర్ గంగాధర్‌పై కఠిన చర్యలకు వేములవాడ న్యాయవాదుల డిమాండ్**



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 08** వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పిట్టల భూమేష్‌ను చంపుతానని బెదిరించిన ఘటనను నిరసిస్తూ బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మపురి పట్టణానికి చెందిన రౌడీషీటర్ గంగాధర్, న్యాయవాది భూమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, ప్రాణహాని తలపెడతానని బెదిరింపులకు పాల్పడినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధి మనోహర్ తెలిపారు. ఈ చర్య న్యాయవృత్తిని మరియు న్యాయవాదుల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చట్టాల కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాను కృష్ణ, సంయుక్త కార్యదర్శి కనికరపు శ్రీనివాస్, కోశాధికారి జెట్టి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి మొగిలి సుజాత, క్రీడల కార్యదర్శి వంగల కర్ణ, మహిళ ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, సీనియర్ ఈసి సభ్యులు మారుముఖం అనిల్ కుమార్, జూనియర్ ఈసి మెంబర్ ఉల్లెందుల అనిల్, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమల గౌడ్, పొత్తూరు అనిల్ కుమార్, గుడిసె సదానందం, రేగుల దేవేందర్, విద్యాసాగర్ రావు, పెంట రాజు, గడ్డం సత్యనారాయణ రెడ్డి, కొడిమ్యాల పురుషోత్తం, నక్క దివాకర్, మాదాసు దేవయ్య, కందుల క్రాంతి కుమార్, నరాల శ్రీనివాస్, కాతుబండ నర్సింగరావు, నడిగోట్ల హరికృష్ణ, పిల్లి మధు, రేగుల రాజకుమార్, మహిళ న్యాయవాదులు పడిగెల మమత, నాయిమా నాసారి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్

- శరవేగంగా పనులు.. ఇప్పటిదాకా 40 శాతం పూర్తి
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 161 కోట్లకుపైగా సాయం జమ
- వేడుకగా గృహ ప్రవేశాలు

**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్- 08 ప్రజా దివాస్** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు 40 శాతం పూర్తి చేసి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆత్మగౌరవ ప్రతీక సాకారం దిశగా ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోంది. ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటిదాకా రూ. 161 కోట్లకుపైగా ఆర్థిక సహాయం జమ చేసి.. రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాల వేడుకలు సాగుతున్నాయి. సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరి చిరకాల స్వప్నం. ఆ కల సాకారానికి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. ఇండ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడుతల్లో అందజేస్తుంది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**ప్రజా ప్రభుత్వం సహకారం..**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. నిర్మాణానికి అవసరమైన ఇసుక అందుబాటులో పెట్టి ఉచితంగా అందిస్తుంది. ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి/ మున్సిపాలిటీల పరిధిలో వార్డ్ ఆఫీసర్స్ తమ తహసీల్దార్ దృష్టికి ముందస్తుగా తీసుకెళ్లాలి. ఇసుక ఉచితం.. రవాణా ఛార్జీలు నిర్మాణదారులు చెల్లించాల్సి ఉంటుంది. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా ద్వారా లక్ష రూపాయల రుణం అందించే ఏర్పాట్లు చేసింది.

**నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మోడల్ హౌస్ లు**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ప్రజా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 11 మండలాల్లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండాకాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. నాణ్యతలో కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.



**40 శాతం ఇండ్లు పూర్తి ..**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు 3,570 స్లాబ్ లెవెల్ లో ఉండగా, 1,419 (దాదాపు 40 శాతం) పూర్తి కాగా, ఇంకా 2,151 ఇండ్లు తుది దశలో ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు ఇప్పటి దాకా జిల్లాలో మొత్తం రూ. 161 కోట్ల 22 లక్షల ఆర్థిక సహాయం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది.

**శరవేగంగా పూర్తి చేసేలా ..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తూ శరవేగంగా పూర్తి చేసేలా పకడ్బందీగా సలహాలు, సూచనలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులతో ఇంటి నిర్మాణ సామగ్రి, భవన నిర్మాణ కార్మికులు, వడ్రంగి, విద్యుత్ సేవలు అందించే వారితో సమావేశాలు ఏర్పాటు చేయించి, వారి ఫోన్ నెంబర్లు, వివరాలను లబ్ధిదారులకు అందుబాటులో పెడుతున్నారు. లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నారు.

**నెరవేరిన 20 ఏండ్ల కల..**

**– కోడూరి రజిత, ఉప్పుగడ్డ, వేములవాడ పట్టణం**

నాకు సొంత ఇల్లు లేదు. 20 సంవత్సరాలుగా వేములవాడ పట్టణంలో నివాసం ఉంటున్న. సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డ. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. నా ఇల్లు పూర్తి అయింది. ఎంతో సంతోషంగా ఉంది. నా కల సాకారానికి సహకారం అందించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గారికి కృతజ్ఞతలు.

**సద్వినియోగం చేసుకోవాలి**

**– వెంకట మాధవరావు, పీడీ హౌసింగ్**

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారు తమ సమీపంలోని హౌసింగ్ అధికారులను సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంలోనే ఇల్లు పూర్తి చేసుకునేలా జిల్లాలో మా శాఖ ఆద్వర్యంలో మోడల్ హౌస్ లు నిర్మించాము. నేరుగా సందర్శించి వివరాలు తెలుసుకోవచ్చు.